
"విజయవాడ"లోని 'విద్యాధరపురం'లో నేనూ, నా మిత్రుడు రత్నం, ప్రక్క ప్రక్క యిళ్లల్లో కాపురం వుంటున్నాం.

నేను 'విజయవాడ', బీసెంట్ రోడ్‌లో మా పెద్దమ్మాయి పేరుతో 'భవానీ ఫ్యాన్సీ ఎంపోరియం', 'గుడివాడ'లో రెండో అమ్మాయి పేరుతో 'పూర్ణా ఫ్యాన్సీ ఎంపోరియం', 'భీమవరం'లో మూడో అమ్మాయి పేరుతో 'రాణీ ఫ్యాన్సీ ఎంపోరియం' ఓపెన్ చేసి, వాటి పర్యవేక్షణ భారం రత్నం భుజస్కందాల మీద మోపాను.

విజయవాడలోని ఎంపోరియం, నా మేనల్లుడు ప్రసాద్ నిర్వహిస్తుంటే, యిక గుడివాడ, భీమవరంలోని షాపులు, రత్నం కొడుకులు కుమార్, దీపక్‌లు చూసుకొంటున్నారు.

నాద్వారా రత్నం కొడుకులిద్దర్కీ ఉపాధి దొరకడం మూలాన, నాకూ, రత్నం మధ్య మైత్రి మరింత బలపడింది.




# దెబ్బకు దెబ్బ

**- బచ్చు వీర్రాజు**

అప్పుడప్పుడు నేనూ, రత్నం మా షాపులో కొంత సేపు గడిపి రావడం రివాజుగా మారింది.

* * *

ఆరోజు బుధవారం. ఉదయం తొమ్మిది గంటలయ్యింది. ఆరోజు రత్నంకు పని వుండి నాతో రాలేకపోతే, నేను ఒక్కడినే మా షాపుకు బయలుదేరాను.

బీసెంట్ రోడ్‌లోని షాపులు ఒక్కొక్కటీ తెరుస్తున్నారు. అప్పటికే మా షాపు కుర్రాళ్లు షాపును తెరిచారు.

నన్ను చూడగానే ప్రసాద్ నాదగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"మావయ్యా! బయట కాస్త పనుంది. కౌంటర్ చూసుకో!" అంటూ బయటకు వెళ్లిపోయాడు.

నేను కౌంటర్ దగ్గర కూర్చున్నాను. జనం ఒక్కొక్కరూ షాపులోకి వస్తున్నారు. బేరం జరుగుతోంది.

యింతలో, వైట్ డ్రెస్‌లో వున్న ఓ యువకుడు షాపులోకి అడుగుపెట్టాడు.

కొన్ని క్షణాలు గడిచాయి. ఆ యువకుడు చేత్తో బిల్లు పట్టుకొని నా దగ్గరకొచ్చాడు. అది వి.ఐ.పి. సూట్‌కేస్ ఖరీదుచేసిన తాలూకు బిల్లు. ఆ బిల్లుతోబాటు ఆ వ్యక్తి ఓ వెయ్యి రూపాయల నోటు కూడా అందించాడు. ఆ కేస్ ధర నాలుగువందల యాభై రూపాయలు.

ఆ వ్యక్తినీ, ఆ నోటునూ ఓసారి పరీక్షగా చూసి, మిగతా చిల్లర అందించాను. యింతలో మా షాపు కుర్రాడు అతని చేతికి ప్యాక్ చేసిన సూట్‌కేస్ అందించాడు. అది తీసుకొని ఆ యువకుడు బయటకు వెళ్లిపోయాడు.

* * *

మరో పది నిముషాలు గడిచాయి. ప్రసాద్ యింకా రాలేదు. యింతలో, గులాబీ రంగు పంజాబీ డ్రెస్ ధరించిన ఓ యువతి మా షాపులోకి అడుగుపెట్టింది. ఆమె చేతిలో వ్యానిటీ బ్యాగ్ దర్శనమిచ్చింది.

ఆ యువతి నా వంక చూస్తూ "లేడీస్ రిస్ట్‌వాచీ కావాలండీ!" అంది నవ్వుతూ.

నేను వెంటనే, నా ప్రక్కనే వున్న మా సేల్స్‌మేన్‌కి సైగ చేసాను. అతను ఆ యువతిని దగ్గరకు పిల్చి, షోకేస్ తెరిచాడు.

కొంతసేపటికి ఆ యువతి ఓ రిస్ట్ వాచీ సెలెక్ట్ చేసుకొని, బిల్లుతో నా దగ్గరకొచ్చి నిలబడింది.

అదే సమయంలో, ఒకేసారి బేరాల తాలూకు మూడు, నాలుగు బిల్స్ రావడంతో కాస్త బిజీగావున్నాను. యీలోపుగా ఆ యువతి నా టేబుల్ మీద తన బిల్లు పెట్టి వీధిలోకి చూడసాగింది.

కొన్ని క్షణాలు గడిచాక, ఆ యువతి తాలూకు బిల్లు చేతిలోకి తీసుకున్నాను. ఆమె తీస్కున్న వాచీ ధర మూడువందల యాభై రూపాయలు.

యింతలో ఆ యువతి "భీమవరం ప్యాసింజర్ టైమ్ కావస్తోంది. నాకు తొందరగా చిల్లర యిస్తే వెళ్తాను!" అంది నవ్వుతూ.

నేను ఉలిక్కి పడ్డాను. "మీరు బిల్లు మాత్రమే యిచ్చారు. యింకా డబ్బు యివ్వలేదు!" అన్నాను నెమ్మదిగా.

"లేదండీ! మీకు వెయ్యి రూపాయల నోటు ముందే యిచ్చాను. కావాలంటే మీ క్యాష్ బాక్స్ తీసి చూడండి!" అంది మళ్లీ నవ్వుతూ.

నేను నిర్ఘాంతపోతూ క్యాష్ డెస్క్ లాగి చూసాను. అందులో, అంతకుముందు సూట్ కేస్ కొన్న యువకుడిచ్చిన వెయ్యి రూపాయల నోటు ఒక్కటే వుంది.

మిగతా నోట్లన్నీ వందా, యాభై, యిరవై, పదీ నోట్లు మాత్రమే వున్నాయి.

నాకు వెంటనే, ఆ అమ్మాయి మోసం చేస్తున్నట్లు స్ఫురించింది. వెంటనే నేను లోపల వున్న ఆ వెయ్యి నోటును పైకి తీసి పట్టుకొన్నాను. ఓసారి అంతకు ముందు జరిగిన సంగతంతా గుర్తుకు తెచ్చుకొన్నాను.

ఆరోజు షాపు ఓపెన్ చేసిన తర్వాత వచ్చిన బేరాలన్నీ వంద లోపు మాత్రమే జరిగాయి. ఏ ఒక్కరూ కూడా ఐదువందల నోటు గానీ, వెయ్యి నోటు గానీ యివ్వలేదు. రోజూ క్యాష్ బాక్స్‌లో కూడా అంత పెద్ద నోట్లుంచి షాపు కట్టేయడం జరుగని పని.

యిలా ఆలోచిస్తూ, ఓసారి ఆ యువతి వంక చూస్తూ "అయితే ఈ వెయ్యి నోటు మీరు యిచ్చిందేనంటారా?" అంటూ ప్రశ్నించాను.

"ముమ్మాటికీ నేను యిచ్చిందే! కావాలంటే ఆ నోటు మీద ఎడమవైపు తెల్లగా వున్నచోట, ఇంగ్లీష్‌లో కె.కె. అన్న అక్షరాలు వుంటాయి. అంటే కృష్ణకుమారి అని అర్థం. నాకు ప్రతి నోటు మీదా అలా నా పేరు, పొడి అక్షరాలుగా బాల్‌పెన్‌తో వ్రాయడం అలవాటు. నోటు మీద నెంబరు కూడా నా డైరీలో వ్రాస్తూ వుంటాను కూడా!" అంటూ సడన్‌గా వ్యానిటీ బ్యాగ్ తెరిచి డైరీ

పైకి తీసింది. ఆ యువతి అది చూస్తూ "దాని నెంబరు 4 ఎయుజడ్58675. ఓసారి చెక్ చేసి చూడండి. మీకే తెలుస్తుంది!" అంది ఆ యువతి నావంక గుచ్చి, గుచ్చి చూస్తూ.

ఆ నోటును పరీక్ష పెట్టి చూస్తూ, ఒక్కసారిగా బిగుసుకుపోయాను.

ఆ యువతి చెప్పినవన్నీ అక్షరాలా నిజమే. ఓప్రక్క ముందు వచ్చిన యువకుడూ, ఈ యువతీ కల్సి యీ రకపు ఘరానా మోసానికి పాల్పడుతున్నట్లు నా మనసుకు తోస్తున్నా, దారిలేక మా షాపు గుడ్‌విల్ దెబ్బతింటుందని, వెంటనే నేనా యువతికి "సారీ"చెప్పి చిల్లరతోబాటు, రిస్ట్‌వాచీ కూడా అందించాను.

దానితో నా మనసు మనసులో లేదు. మతిపోయినట్లైంది. ఏమైనాసరే వీళ్ల సంగతి చూడాలని గట్టిగా నిర్ణయించుకొన్నాను. మాటల్లో ఆ యువతి "భీమవరం ప్యాసింజర్"గురించి అన్నమాటలు గుర్తుకొచ్చాయి.

వెంటనే నా మనసులో ఓ పథకం రూపుదిద్దుకోసాగింది. యీ జరిగిన సంగతి మిగతా కస్టమర్ల దృష్టిలో పడకపోవడం మంచిదయ్యింది. లేకుంటే ఆ యువతి పన్నిన వ్యూహాన్ని ప్రతి ఒక్కరూ నమ్మి, అంతా ఆమె పక్షాన్నే నిలబడి వుండేవారు. అందరి ముందూ, నేను తల దించుకునే పరిస్థితి తప్పినందుకు ఒకందుకు సంతోషించాను.

ముందుగా ఆ యువతి నోటు నెంబరు డైరీలో వ్రాసుకొని, నోటుమీద అక్షరాలు వ్రాసి, ఆ నోటునే యువకుడికిచ్చి ఈ నాటకం ఆడుకున్నట్లు నిర్ధారించుకొన్నాను.

మరో అరగంట గడిచేసరికి, ఒకేసారి నా మిత్రుడు రత్నం, మా మేనల్లుడు ప్రసాద్ షాపులోకి అడుగుపెట్టారు.

నేను మారు మాట్లాడకుండగా, కౌంటర్ ప్రసాద్‌కు అప్పచెప్పి, రత్నం భుజంమీద చెయ్యివేసి బయటకు లాక్కుపోయాను.

దారిలో రత్నంకు జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పాను. అది విన్న రత్నం ముక్కుమీద వ్రేలేసుకొన్నాడు.

"మాటల్లో ఆ యువతి భీమవరం ప్యాసింజర్ ఎక్కబోతున్నట్లు తెలిసిందిరా!" అన్నాను రత్నం వంక చూస్తూ.

"సరే! నడు వెళ్దాం! అయినా వాళ్లు, వాళ్ల స్వగ్రామానికి వెళ్లిపోతున్నారో లేక మరో పట్నంలో వాళ్ల ప్రతాపం చూపబోతారో మనకెలా తెలుస్తుంది?"అని ప్రశ్నించాడు రత్నం ఏదో ఆలోచిస్తూ.

"వాళ్లెక్కిన ప్యాసింజర్ మనకెలాగూ అందదు. దాని తర్వాత ప్యాసింజర్ మాత్రమే మనం ఎక్కాలి. అది ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ మనం దిగి ఎంక్వైరీ చేద్దాం. పెద్ద, పెద్ద పట్టణాల్లో పెద్ద షాపుల్లోనే వాళ్ల మోసం ఫలిస్తుంది. గుడివాడలోనూ, భీమవరంలోనూ మన షాపు సిబ్బందిని ఓసారి హెచ్చరిద్దాం. అదృష్టంకొద్దీ మనకి వాళ్లు తారసపడితే వాళ్ల భరతం పడదాం!" అన్నాను నేను ఆవేశంగా.

"సరేలే కానీ, అలాగే చేద్దాం!" అన్నాడు రత్నం నా భుజం మీద చెయ్యివేసి.

వెంటనే, దగ్గరలో వున్న ఆటోని పిల్చి 'స్టేషన్‌కు పోనీ!" అంటూ యిద్దరం ఎక్కి కూర్చున్నాం.

* * *

మరో పది నిముషాల్లో మా ఆటో స్టేషన్ ముందు ఆగింది. ఆటో వాలాకి డబ్బులిచ్చి బుక్కింగ్ వైపు నడిచాం. రెండు భీమవరం టిక్కెట్లు తీసుకొని భీమవరం వెళ్లే ట్రెయిన్ ఎక్కి కూర్చున్నాం.

మరో అరగంట తర్వాత ట్రెయిన్ బయలుదేరింది. అది "రామవరప్పాడు" స్టేషన్‌లో గంటకు పైగా నిల్చిపోయింది.

ఎంక్వైరీ చేస్తే, ముందున్న రెండు స్టేషన్ల మధ్య ఓ గూడ్స్ ట్రైన్ యింజన్ ఫెయిలయ్యిందనీ, దానివల్ల మా ట్రెయిన్ ముందు బయలుదేరిన ప్యాసింజర్ కూడా మా ముందు స్టేషన్‌లో ఆగిపోయిందనీ తెల్సింది.

మా ముందు బాలుదేరిన బండి ముందు స్టేషన్‌లోనే వున్నట్లు తెల్సి ఆనందించాం.

రత్నం పేపర్ చదువుతూ బండిలో కూర్చున్నాడు. నేను బండి దిగి స్టేషన్ వైపుకి నడిచాను.



"అవును సార్! ఆ జంట భలే జంట సార్! చూడ ముచ్చటగా వుంది. అబ్బాయి చేతిలో ఓ సూట్ కేస్ కూడా వుంది. అమ్మాయి చేతిలో వ్యానిటీ బ్యాగ్ తప్ప మరేమీ లేవు! వాళ్లు మీ ముందు వచ్చిన ట్రెయిన్‌లో దిగి ఊళ్లోకి వెళ్లిపోయారు!"

అక్కడ గేటుదగ్గర పోర్టర్ కనబడితే "బాబూ! యింతకు ముందు వెళ్లిన ప్యాసింజర్‌లోంచి, వైట్ డ్రెస్ వేస్కున్న యువకుడూ, గులాబీ రంగు పంజాబీ డ్రెస్ వేస్కున్న యువతీ యిక్కడ దిగడం నీ కంటబడిందా?" అంటూ ప్రశ్నించాను.

"లేదండీ! వాళ్లిక్కడ దిగలేదు. ఆ బండి యిక్కడ చాలాసేపు ఆగితే, మీరు చెప్పిన వాళ్లిద్దరూ ప్లాట్‌ఫాం మీద పచార్లు చేసి, తిరిగి బండెక్కి వెళ్లిపోయారు!"అంటూ స్టేషన్‌లోకి వెళ్లిపోయాడు పోర్టర్.

మరి కొంతసేపటికి, పోర్టర్ బయటకు వచ్చి మా బండికి బెల్‌కొట్టాడు.

"మరో యింజన్ వచ్చి ఆ గూడ్స్ బండిని క్లియర్ చేసింది. మీ బండి బయలుదేరుతుంది. వెళ్లండి!" అన్నాడు నా వంక చూస్తూ.

గబగబా నేను బండి ఎక్కి, ఆ జంట గురించి, పోర్టర్ నాకు చెప్పిన సంగతి రత్నం చెవిలో ఊదాను.

కొంత సేపటికి బండి కదిలింది.

* * *

మా ట్రెయిన్ వరుసగా 'నిడమానూరు', 'ఉప్పలూరు', 'తెన్నేరు', 'తరిగొప్పుల', 'ఇందుపల్లి', 'వెంట్రాప్రగడ', 'దోసపాడు', 'గుడివాడ', 'మోటూరు', 'గుంటకోడూరు', 'పసలపూడి', 'పుట్ల చెరువు', 'మొఖాసాకలవపూడి', 'మండవిల్లి', 'కైకలూరు', 'పల్లెవాడ', 'ఆకివీడు', 'ఉండి' స్టేషన్లలో ఆగుతూ కదిలింది.

ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ మేమిద్దరం గబగబా దిగి ఆ జంట గురించి ఎంక్వైరీ చేస్తూ తిరిగి బండెక్కి ప్రయాణం ముందుకు సాగించాం.

వచ్చేది భీమవరం టౌన్ స్టేషన్. వాళ్లు ఏ స్టేషన్‌లోనూ దిగి వుండకపోవడంతో వాళ్లు తప్పకుండగా యిక్కడే దిగి, తిరిగి "ఏ షాపువాళ్లనో బురిడీ కొట్టించడం ఖాయం"అని నేనూ, రత్నం నిర్ధారించుకొన్నాం.

* * *

బండి భీమవరం టౌన్ స్టేషన్‌లో ఆగింది. అప్పుడు టైమ్ సాయంత్రం ఆరు గంటలయ్యింది. మేమిద్దరం బండి దిగి కొంతసేపు గేటు దగ్గరే నిలబడ్డాం.

ప్రయాణీకులంతా వెళ్లిపోయాక, గేటుప్రక్కన నలుగురైదుగురు లైసెన్స్ కూలీలు గుమికూడి వుంటే, ఆ జంట గురించి నెమ్మదిగా వాకబు చేసాం.

వాళ్లల్లో ఓ లైసెన్స్ కూలీ "అవును సార్! ఆ జంట భలే జంట సార్! చూడ ముచ్చటగా వుంది. అబ్బాయి చేతిలో ఓ సూట్ కేస్ కూడా వుంది. అమ్మాయి చేతిలో వ్యానిటీ బ్యాగ్ తప్ప మరేమీ లేవు! వాళ్లు మీ ముందు వచ్చిన ట్రెయిన్‌లో దిగి ఊళ్లోకి వెళ్లిపోయారు!" అన్నాడు ఒగురుస్తూ.

ఆ మాటలు వినగానే, నేనూ రత్నం ఒకరి ముఖాలొకరు చూసుకొని, ఆ కూలీ భుజం తట్టి బయటకు నడిచాం.

* * *

ఈ దొంగలవేట పేరుచెప్పి, ఆరోజు మాకు భోజనం లేకపోవడంతో యిద్దరికీ కడుపు కాలిపోతుంటే, ఓ హోటల్ వైపుకు దారితీసాం. అక్కడ ఓ టేబుల్ దగ్గర కూర్చుని టిఫిన్ ఆర్డర్ చేసాం.

"ఒరేయ్! రత్నం. వాళ్లు ముమ్మాటికీ మన షాపులోకి వస్తారు. మనం హుషారుగా వుండి వాళ్ల ఆటకట్టించాలి. దెబ్బకుదెబ్బ తియ్యాలి!" అన్నాను రత్నం భుజం తట్టి.

"రైట్! అలాగే!" అన్నాడు రత్నం నవ్వుతూ.

బేరర్ తెచ్చిన యిడ్లీ, పూరీ ప్లేట్లు దగ్గరకు లాక్కుని ఆరగించడం మొదలుపెట్టాం. నేను టిఫిన్ తింటూ, మా షాపులో మేము ఆచరించవలసిన వ్యూహం గురించి ఆలోచించసాగాను.

కొంతసేపటికి నా ప్లాన్ రూపుదిద్దుకొంది. వెంటనే దానిని నేను రత్నంకు నెమ్మదిగా చెప్పాను.

దానికి వాడు "వెరీగుడ్! ప్లాన్ చాలాబాగుంది. పిట్టలు వలలో పడతాయి. నడు!" అన్నాడు కాఫీ త్రాగుతూ.


నేను కూడా త్రాగాక, బిల్లు చెల్లించి బయట పడ్డాం.

ముందుగా మావుళ్లమ్మ దర్శనం చేసుకోవాలని, ఆటో ఎక్కి గుడి దగ్గర దిగాం.

ఆటో దిగీదిగ గానే నా కళ్లు ఒక్కసారిగా మిలమిలా మెరిశాయి. అదే జంట- ఆ తోడుదొంగలిద్దరూ గుడి నుంచి బయటకు వస్తూ నా కంట్లో పడ్డారు. యిద్దరూ అదే డ్రెస్‌లో వున్నారు. మార్చుకోలేదు. ఆ యువకుని చేతిలో సూట్‌కేస్ కనబడలేదు. బహుశా ఎక్కడో వుంచి వుంటారనుకొన్నాను. వెంటనే ఆ యిద్దర్నీ మా రత్నంకు చూపించి "మనం వెదకపోయే తీగలు అవే!"అన్నాను ఆనందంగా.

(మిగతా 12వ పేజీలో)

# అతడు నిద్రను జయించాడు!



కల్పనకన్నా వాస్తవం ఒక్కోసారి నమ్మశక్యంకాదు. అనాదిగా ఈ వ్యాఖ్యని వింటూనే వున్నాం. అయినా దిలీప్‌చౌరాసియా కథ కల్పనేం కాదు కొనసాగుతూన్న ఓ విస్మయకర యధార్థం. అతన్ని ఓ అప్సరస వరించింది. స్వర్గలోకంలో విహరించారు ఆ ఇద్దరు. వాగ్దానం అతిక్రమించాడతను. శాపానికి గురయ్యాను అంటున్నాడు నేడు.

దమ్‌కా టౌన్ వాసి అయినా 47 ఏళ్ల దిలీప్ ఇరవైమూడేళ్లుగా నిద్రకి దూరమయ్యాడు. వ్యక్తిగతంగా సౌమ్యుడు మానవతా స్పందన వుంది. దాదాపు 20 మందిని రక్తదానంతో ఆదుకున్నాడు. పాపం వందలాది మంది డాక్టర్లని సంప్రదించినా అతని నిద్రలేమిని ఎవరూ నయం చేయలేకపోతున్నారు. ఆధునిక వైద్యశాస్త్రంలో ఎన్ని రకాల పరీక్షలున్నాయో మందులున్నాయో అన్నింటినీ వినియోగించారు. పాత కేస్ హిస్టరీలను సమకాలీన సమాచారాన్ని అధ్యయనం చేశారు, ప్రయోగించి చూశారు అయినా అతనికి నిద్ర రాలేదు. అతని రెప్పలు సదా తెరచుకునే వుంటాయి.

ప్రతిష్ఠ ప్రఖ్యాతిగల వైద్య సంస్థల ప్రతినిధులు పెదవి విరిచేశారు. వైద్య విజ్ఞానానికే అంతుబట్టని కేస్‌గా తేల్చేశారు. దిలీప్ మాత్రం అలా వూరుకుండలేకపోయాడు. ఎలా వుండగలడు అనుక్షణం చిత్రహింసలాంటి నిద్ర లేమితో.

చివరకు సాహసంతో భయంకర అశాస్త్రీయ చికిత్సా పంథాని అనుసరించాడు. వింటానికే భీతి జుగుప్స.

కొండల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వెలుగు ప్రసరించని గుబురుల్లోని పుట్టల్లో చీకటి గుహల్లో మాత్రమే కదలాడే కింగ్ కోబ్రా, రక్తపింజరి, తేళ్లు, విష కీటకాలను పట్టి సేకరించి సరాసరి నాలుకపై కాటేయించుకునేవాడు. వొంటిపై పారాడించుకునేవాడు. కుటుంబీకులందరూ నిద్రిస్తున్న వేళ పడకపై క్రిమికీటక తేళ్లు తదితరాలతో దోబూచులాడేవాడతను.

పాపం.. నిమిషం నుండి ఐదు నిమిషాలు అదీ కాస్త మత్తులాంటి స్థితి మాగన్నుగా నిద్ర అంటామే- అంతే మరల యధాతథ స్థితి.

ఇంతకీ నిద్రలేమికి అతడు ఎందుకు దూరమయ్యాడంటే దానికి ఓ కథ వుందంటాడు. ఇరవై మూడు సంవత్సరాల క్రితం ఓ అప్సరస తన వద్దకు వచ్చేదని, మళ్లీ వస్తానని చెప్పిందంటాడు. అయితే ఆమె శపించిందో ఏమో తెలియదు కానీ ఆ కాంత అనుగ్రహం లభించేవరకు తనకు నిద్ర రాదంటున్నాడు. అప్సరస రాలేదు. కళ్లల్లో కొవ్వొత్తులు వెలిగించుకుని రెప్పార్పకుండా చూస్తూ వుండిపోయాడు.

నేటికీ రెప్పలు మూతపడలేదు. అప్సరస రాదు నిద్రా రాదు. అయినా ప్రతి శిక్షకూ కాల పరిమితి వుంటుంది. ప్రతి శాపానికి జాతి అనుగ్రహం వుండి తీరుతుంది అన్న ఆశతో ఎదురు చూస్తున్నాడు ఆమె రాకకోసం.

**- సాయి కిరణ్మయి**

---

(9వ పేజీ తరువాయి)

వెంటనే రత్నం వాళ్లను పరీక్ష పెట్టి చూసాడు. ఆ జంట వెళ్లిపోగానే, మేమిద్దరం మావుళ్లమ్మ దర్శనం చేసుకొని గబగబా మా షాపు దగ్గరకు బయలుదేరాం

★ ★ ★

షాపుదగ్గర మమ్మల్ని చూడగానే, రత్నం కొడుకు దీపక్ కౌంటర్ దగ్గర నుంచి మా దగ్గరకొచ్చాడు సంబరపడిపోతూ.

రత్నం ఆప్యాయంగా దీపక్ భుజం తట్టాడు. నేనింక ఆలస్యం చెయ్యకుండగా దీపక్‌ను దగ్గరికి పిల్చాను.

దీపక్ నాటకాల రాయుడు. అతనికి ఓ చిన్న ట్రూప్ కూడా వుంది. సంగతంతా టూకీగా చెప్పి, ఏంచెయ్యాలో విడమర్చి చెప్పాను.

దీపక్ వెంటనే బయటకు వెళ్లిపోయాడు. రత్నం కౌంటర్ దగ్గర సర్దుకొన్నాడు. నేను షాపుముందు బయట ఓ ప్రక్కగా నిల్చున్నాను.

★ ★ ★

ఓ అరగంట గడిచింది. యింతలో నేను అనుకొన్నట్లుగానే జరిగింది. ఆ వైట్‌డ్రెస్ యువకుడు మా షాపువైపుకే రావడం గమనించి, రత్నంకు సైగ చేసాను.

షాపులో కస్టమర్లు అంత ఎక్కువగా లేరు. కొంతసేపటికి ఆ యువకుడు ఓ చేత్తో ఎయిర్‌బ్యాగ్ పట్టుకొని, రెండో చేతిలో వున్న బిల్లు రత్నంకు అందించాడు. తిరిగి అదే పద్ధతిలో జేబులోంచి వెయ్యి నోటు తీసి రత్నంకు యిచ్చాడు. ఆ బ్యాగ్ ఖరీదు రెండువందల యాభై రూపాయలు. ఆ నోటును ఓసారి పరీక్షించి, లోపల వేస్తూ మిగతా చిల్లర అందించాడు రత్నం. చాటుగా వుండి, నేనంతా గమనిస్తున్నానని రత్నం ముందుగానే ఊహించాడు.

మరో పది నిముషాలు గడిచాయి. నా కళ్లు ఒక్కసారిగా తళుక్కుమన్నాయి. ఆ యువతి మాషాపు వైపుకు రాసాగింది. నేను తిరిగి రత్నంకు సైగ చేసాను. రత్నం నవ్వి ఊరుకొన్నాడు.

ఆ యువతి షాపులోపలికి వెళ్లి ఓ నాలుగు ఆడియో క్యాసెట్లూ ఓ రోల్డ్‌గోల్డ్ చైనూ ఖరీదుచేసి బిల్లుతో కౌంటర్ దగ్గరకొచ్చింది.

బిల్లు టేబుల్‌మీద పెట్టి ప్రక్కగా నిలబడింది. ఆ యువతికన్నా ముందు వచ్చి బిల్లు యిచ్చిన కస్టమర్‌తో రత్నం ఏదో మాట్లాడసాగాడు. ఆ వ్యక్తి వెళ్లిపోయాక, ఆ యువతి తాలూకు బిల్లు అందుకొని డబ్బులుకోసం చెయ్యి ముందుకు పెట్టాడు రత్నం.

"అదేమిటంటే! మీకు ముందుగానే వెయ్యి నోటు యిచ్చానుగదా?" అంది ఒయ్యారం ఒలకపోస్తూ ఆ యువతి.

"మీరెక్కడ యిచ్చారు? యివ్వలేదే!" అన్నాడు రత్నం కంగారు నటిస్తూ.

దానికి యువతి "లేదండీ! యిచ్చాను. మీరు మర్చిపోయినట్లున్నారు. ఓసారి సొరుగు లాగి చూడండి. మీకే తెలుస్తుంది!" అంది నెమ్మదిగా.

వెంటనే రత్నం సొరుగు లాగి పైనే వున్న వెయ్యి నోటును చేత్తో బయటకు తీసాడు.

"అదే నోటు. దాని మీద కె.కె. అన్న అక్షరాలుంటాయి. చూడండి!" అంది నవ్వుతూ ఆ యువతి.

రత్నం ఆ యువతి వంకే చూస్తూ నిలబడిపోయాడు.

యింతలో ఆ యువతి వ్యానిటీ బ్యాగ్‌లో వున్న డైరీ తెరిచింది.

"కావాలంటే దాని నెంబరు చెబుతాను చెక్ చేయండి. దాని నెంబరు 4ఎయుజడ్58676. చూడండి!" అంది కాస్త గట్టిగా.

దానికి రత్నం ఒక్కసారి ఉలిక్కిపడ్డట్లు నటించాడు.

"అవునమ్మా! నిజమే. ఒక్కసారి ఆగండి. యిది దొంగ నోటులా వుంది!" అన్నాడు రత్నం ఆ నోటును పరీక్షిస్తూ.

ఆ యువతి ఒక్కసారిగా గతుక్కుమంది. అటూ ఇటూ చూస్తు కంగారుపడి పోయింది.

యింతలో, దీపక్ యినస్పెక్టర్ వేషంలోనూ, అతని ఫ్రెండ్స్ కానిస్టేబుళ్ల వేషంలోనూ, బూట్లు టకటకలాడిస్తూ చేతిలో లాఠీలు పట్టుకొని ప్రవేశించారు.

అంతా నా ప్లాన్ ప్రకారమే జరుగుతున్నందుకు నా మనసు గంతులెయ్యసాగింది. సేల్స్‌మెన్ అంతా తెల్లబోయి చూస్తున్నారు.

'ఏంటి సార్ గొడవ?" అంటూ దీపక్ తండ్రిదగ్గరకెళ్లి ప్రశ్నించాడు హుందాగా.

రత్నం తన కొడుకు నటనకు ఆశ్చర్యపోతూ "అబ్బే! ఈ అమ్మాయి యిచ్చిన నోటు దొంగ నోటులా వుంది!" అంటూ ఆ నోటును దీపక్ చేతిలో పెట్టి కన్ను గీటాడు.

దీపక్ ఆ నోటుని చూసి "అవును! దొంగనోటే. పద స్టేషన్‌కు!" అంటూ ఆ యువతిని గద్దించాడు.

యింతలో, "ఆమె వ్యానిటీ బ్యాగ్‌లో యింకా దొంగ నోట్లు కనబడ్తాయేమో చూడండి!" అన్నాడు రత్నం గట్టిగా.

వెంటనే కానిస్టేబుల్స్ ఆ బ్యాగ్ లాక్కుని క్రిందకు దులిపారు. అందులోంచి పది వెయ్యి నోట్లు జారిపడ్డాయి.

ఆ యువతి ఒణికిపోతూ నిలబడింది.

"అవును! యివన్నీ దొంగ నోట్లే!"అన్నాడు దీపక్ గట్టిగా ఆ నోట్లు పట్టుకొని. నిజానికి అమ్మాయి యిచ్చే నోట్లన్నీ మంచివేనని నాకు తెలుసు.

"ఉండండి! ఆ నోట్లు యిచ్చినాయన్ని తీసుకువస్తాను! అంటూ ఆ యువతి ఒక్కసారిగా బయటకు పరుగెత్తింది కంగారుగా.

ఆమె వెనకాల కానిస్టేబుళ్లిద్దరూ పరుగెత్తబోతుంటే, నేను వాళ్లని పట్టుకొని ఆపాను. ఓ గంట గడిచినా ఆ యువతి తిరిగిరాలేదు.

"యింక, ఆ అమ్మాయి తిరిగి రాదు. మనకి పదివేలు లాభం!"అన్నాడు రత్నం పకపకా నవ్వుతూ.

జరిగిన సంగతంతా తెల్సుకొన్న షాపు సిబ్బంది ఒక్కసారిగా నివ్వెరపోయారు. నేను దీపక్ భుజం తట్టి ఆ పదివేలూ అతని చేతిలో వుంచాను. ★